క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం



లింగాల ఆదినారాయణను సత్కరిస్తున్న పబ్లిక్ హెల్త్ కార్మికులు

కంచరపాలెం: వార్డు అభివృద్ధిలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకమని కార్పొరేటర్ గంకల కవిత అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు కార్యాలయంలో గురువారం శానిటరీ మేస్త్రీగా 40 ఏళ్లు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన లింగాల ఆదినారాయణకు కార్పొరేటర్ కవిత, జోన్–5 పబ్లిక్ హెల్త్ సిబ్బంది, బీజేపీ సీనియర్ నాయకుడు గంకల అప్పారావు సత్కరించారు. కరోనా వంటి కష్టకాలంలో పారిశుధ్య కార్మికులు ఎనలేని సేవలు అందించారన్నారు. ఆదినారాయణ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని తోటి కార్మికులు అభినందనలు తెలిపారు.

నేడు మాక్‌డ్రిల్

మల్కాపురం: సంస్థలో జరిగే ప్రమాదాలు, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు వారిని వారు ఎలా రక్షించుకుంటారు, ఆపదలో ఉన్న వారిని ఎలా రక్షిస్తారు.. అనే అంశంపై కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థలో శుక్రవారం ఉదయం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ వారి పర్యవేక్షణలో కోరమాండల్ సంస్థను ఆనుకుని ఉన్న పిలకవానిపాలెంలో మాక్‌డ్రిల్ జరుగుతుంది. సంస్థ నుంచి అగ్నిమాపక సిబ్బంది, అగ్నిమాపక శకటం, అంబులెన్స్ వంటి వాహనాలు వస్తాయని, వీటిని చూసి పిలకవానిపాలెం గ్రామస్తులు ఎటువంటి ఆందోళన, భయం చెందవద్దని సంస్థ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గాంధీజీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: వాసవీ క్లబ్ ప్రతినిధులు అక్కిరెడ్డిపాలెంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు నున్నా గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి క్లబ్ ప్రతినిధి కొల్లూరు సోమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహావిష్కరణను పురస్కరించుకుని అక్కిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కెచ్ పెన్నులు, వీధి వ్యాపారులకు గొడుగులు, ట్రాఫిక్ కమ్యూనిటీ గార్డులకు మాస్కులు, టవల్స్ అందజేశారు. అలాగే, భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయానికి ఇత్తడి పళ్లేలను బహూకరించారు. క్లబ్ కార్యదర్శి జి.కుమార స్వామి, కోశాధికారి నున్నా శ్రీరామ్మూర్తి, ప్రతినిధులు కటకం శైలజ, ఉద్దగిరి కుమార గుప్తా, ఆర్.సి.నాగేశ్వరరావు, ఎస్.సతీష్ కుమార్, రమేష్ కుమార్, క్లబ్‌కు చెందిన పలువురు డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం: జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో కొలువైన శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి పండగ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ననపల కీర్తి పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్త అమ్మవారి చిత్రపటం జ్ఞాపికను అందజేశారు.

త్వరితగతిన గెడ్డను విస్తరించాలి

- వర్షాకాలంలో పొంచి ఉన్న ముంపు ముప్పు
- జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే గణబాబు సూచన
- 58, 60 వార్డుల్లో పర్యటన



గుల్లలపాలెంలో గెడ్డ సమస్యను కమిషనర్ సాయికాంత్ వర్మకు వివరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లల పాలెం వద్ద గెడ్డను త్వరితగతిన విస్తరించాలని ఎమ్మెల్యే పి.గణబాబు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు సూచించారు. జీవీఎంసీ 58, 60 వార్డుల్లో గురువారం ఉదయం వారిరువురూ అధికారులతో కలసి పర్యటించారు. తొలుత 60వ వార్డు పరిధి కోరమాండల్ సమీపంలోని శ్మశానవాటిక వద్దకు వెళ్లి, అక్కడ సమస్యలను గుర్తించారు. త్వరలో అక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనులపై కమిషనర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం 58వ వార్డు గుల్లలపాలెం వద్ద గల గెడ్డను పరిశీలించారు. ఈ వర్షాకాలంలో వర్షపాతం ఎక్కువైతే ఎగువ ప్రాంతాల నుంచి నీరు గెడ్డలో చేరి, పొంగి గెడ్డను ఆనుకుని ఉన్న ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. త్వరితగతిన గెడ్డ విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఉన్నతాధికారులు, కోరమాండల్ సంస్థ అధికారులతో పాటు స్థానిక టీడీపీ నాయకులు కోరాడ శ్రీను, ఉరుకూటి డేవిడ్, జోజిబాబు, పోతబత్తుల శ్రీను, శీరం ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రిలో సమస్యల పరిశీలన



చిల్డ్రన్ వార్డులో మూలకు చేరిన ఆక్సిజన్ కిట్



ఎమ్మెల్యే గణబాబుకు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వివరిస్తున్న రోగులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని 30 పడకల ఆస్పత్రి (ఎఫ్‌ఆర్‌యూ)లో రోగులకు అవసరమైన పలు వైద్య పరికరాలు మొరాయించాయి. చిల్డ్రన్ వార్డులో ఆక్సిజన్ కిట్ మూలకు చేరింది. ఆక్సిజన్ మిషన్, బెడ్స్ నిరుపయోగంగా మారాయి. ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు వెలగడం లేదు. ఆస్పత్రిలో జనరేటర్ సదుపాయం అంతంతమాత్రం గానే ఉంది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ఆకతాయిలు రాత్రి వేళ ఆస్పత్రి రక్షణ గోడపై కూర్చుని అక్కడి వచ్చే వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే పి.గణబాబు దృష్టికి పలువురు రోగులు, స్థానిక టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గురువారం ఉదయం ఆస్పత్రిని ఆకస్మాతుగా తనిఖీ చేశారు. అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని రోగులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు కోరాడ శ్రీను, పోతబత్తుల శ్రీను, మాత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్‌వో నాయుడికి చెక్కు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం పీఎం పాలేనికి చెందిన బలిజి నాగేశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు. సింహగిరిపై విచారణ కార్యాలయంలో సంబంధిత చెక్కుని దేవస్థానం పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో 'ఉక్కు'కు పూర్వవైభవం



మాట్లాడుతున్న ఉక్కు పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయగలిగితే పునరుజ్జీవం పొంది, పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1232వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. వీరిద్దరూ తలచుకుంటే ఉక్కు ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగడంతో పాటు పూర్వవైభవం ఉక్కుకు రాగలదన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎన్నో అవరోధాలు, ఆటంకాలను దాటుకుని ఉక్కు పరిశ్రమను విస్తరించుకుంటే పారిశ్రామికవేత్తల ఆకలిని తీర్చడానికి విశాఖ ఉక్కును బలిపశువును చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయ, బి.ఎస్.రాజు, డి.సి.హెచ్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అప్పారావు, గోవింద్, రమణ, దాసరి శ్రీను, గంగాధర్, అప్పారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు



సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: జూలై ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు నగరంలోని మురళీనగర్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ తెలిపారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చలు జరుపుతామన్నారు. గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్లు, ప్రతికూల పోకడలపై చర్చించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చించి, తీర్మానాలను చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మతోన్మాద పార్టీ బీజేపీతో అంటకాగుతోందని, గత ప్రభుత్వంలో దొర్లిన తప్పులనే మళ్లీ చేయకుండా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, పి.దుర్గారావు, కె.పోతయ్య, కె.రాజబాబు, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులకు చెక్

అగనంపూడి: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అగనంపూడి హోమియో వైద్యురాలు డాక్టర్ కె.కళావతి అన్నారు. పెదమడక పాఠశాలలో అగనంపూడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తాయని, వాటి వల్ల డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, కలరా, విష జ్వరాలు, దగ్గు, జలుబు వంటి రకరకాల వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, కలుషిత ఆహారం తీసుకోవద్దని సూచించారు. భోజనం చేసే ముందు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ గుదే సుశీలా గజేంద్రరావు, ప్రతినిధులు బొండా ఈశ్వరరావు, ఎం.మస్తాన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాల బహూకరణ

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాలు, జర్నల్స్‌ను మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు బహూకరించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం స్టాటస్టిక్స్ విభాగంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆచార్య కె.శ్రీనివాసరావు స్టాటస్టిక్స్ విభాగం ద్వారా వర్సిటీకి 40 ఏళ్లు సుదీర్ఘ సేవలు అందించారు. వివిధ హోదాల్లో వర్సిటీ ప్రగతికి కృషి చేశారు. తన పరిశోధనలకు సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్ ఆల్బమ్స్‌తో పాటు ప్రముఖ వ్యాసాలతో కూడిన పుస్తకాలు విభాగ లైబ్రరీ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో బహూకరించారు. వీసీ ఆయన సేవలను ప్రశంసించడంతో పాటు 1300 పుస్తకాలు విభాగ లైబ్రరీకి అందించడంపై అభినందించారు.

పోర్ట్ అథారిటీ బోర్డ్ మెంబర్‌గా పోతన్న



కంచరపాలెం: విశాఖ హార్బర్ పోర్ట్ వర్కర్స్ ఏఐటీయూసీ నుంచి యు.పోతన్న విశాఖ పోర్ట్ అథారిటీ బోర్డు మెంబర్‌గా నియమితుడయ్యారు. ఈ మేరకు పోర్ట్ మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పోతన్నను యూనియన్ సభ్యులు, కార్మికులు అభినందించి ఘనంగా సత్కరించారు.

లలితా పీఠంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి



సంచికను ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రచయిత డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి నిర్వహించారు. 24 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరించారు. ఈ సభకు ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు. కవితా గోష్ఠి అనంతరం కవులను స్వామి వారు సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని మేనేజర్ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఈ నెల 19వ తేదీన అర్ధరాత్రి కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన గుర్తు తెలియని యువకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 26న మరణించినట్లు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మల్కాపురం నుంచి గాజువాక వైపు నడిచి వస్తున్న గుర్తు తెలియని యువకుడిని కారు వెనుక నుంచి ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి చేతికి, తలకు తీవ్ర గాయాలవడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఆ యువకుడు చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందినట్లు సీఐ చెప్పారు. అయితే ఆ వ్యక్తి వివరాలు తెలియలేదన్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావును సంప్రదించాలని కోరారు. 94407 96018కు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తాటిచెట్లపాలెంలోని చిట్టిబాబు కాలనీ మెహర్ బాబా ధ్యాన మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి ఏబీ మెడికల్ సర్వీసెస్ సహకారంతో శిబిరం జరుగుతుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ వినీల మేడపాటి, నియో విజన్ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ బి.బాలకృష్ణ, కీళ్ల వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎడ్ల దిలీప్ రాజాతోపాటు జనరల్ ఫిజీషియన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు.

పేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీ ప్రారంభిస్తున్న బిషప్ మహంతి

గాజువాక: స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు గురువారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందని, అందులో భాగంగా కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నామని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

హెచ్‌ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్ ఆల్ఫా కృష్ణ



ఆల్ఫా కృష్ణను సత్కరిస్తున్న కౌన్సిల్ సభ్యులు

విశాఖ విద్య: మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని హెచ్‌ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్ ఆల్ఫా కృష్ణ అన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) జాతీయ కన్వీనర్‌గా నియమితులైన ఆయనను కౌన్సిల్ సభ్యులు గురువారం సన్మానించారు. ఎస్‌పీడీ సెంటర్‌లోని ఆల్ఫా ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఆర్‌సీఐ సభ్యులతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, మానవ హక్కుల పరిరక్షణకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసే వారి హక్కుల పరిరక్షణకు కౌన్సిల్ అండగా నిలుస్తుందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు తమ దృష్టికి తీసుకొస్తే, నిబంధనల మేరకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మూడు దఫాలుగా వ్యవహరించడంతో పాటు, ఆల్ఫా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నందునే ఆల్ఫా కృష్ణను హెచ్‌ఆర్‌సీఐకు జాతీయ కన్వీనర్‌గా ఎంపిక చేశామని కౌన్సిల్ జాతీయ కార్యదర్శి మాదాసి చారేంద్ర అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఆధ్వర్యంలో కృష్ణను ఘనంగా సత్కరించారు. సమావేశంలో కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు నానాజీ, రాజేశ్వరరావు, మంజుల, సెల్వాని, జయ కృష్ణ, వెంకట కృష్ణ, ఏకే. రాజు, రమేష్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గొర్లె గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

భక్తులకు భారీ అన్నదానం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం (ఏపీఎస్‌ఈబీ కాలనీ)లో కొలువుదీరిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున 5గంటలకు బాబాకు ఆరతి, మంగళస్నానం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం బాబాను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం విశేష పూజలు చేశారు. సామూహిక భజనలు భక్తి పారవశ్యాన్ని నింపాయి.

బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే

సాయినాథుడిని ఎమ్మెల్యే గణబాబు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ దర్శించుకుని, పూజలు చేశారు. వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. బాబా దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల వారు, సాయి సేవకులు బాబా ప్రసాదాన్ని స్వీకరించారు.

అప్పన్న స్వామికి ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



నిత్య కల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



బాల్య వివాహాలు వద్దంటూ కళాజాతలో వివరిస్తున్న కళాకారులు

పెదగంట్యాడ: 'బాల్య వివాహాలు వద్దు.. బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం' అంటూ ప్రదర్శించిన కళాజాత ఆలోచింపజేసింది. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని 64వ వార్డు గంగవరంలో చేపలపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ కార్యకర్త శ్రీరం దుర్గమ్మ ఆధ్వర్యంలో గురువారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కు చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి పాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పడాల శాంతి, పేర్ల దేముడమ్మ, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

'టోల్‌ప్లాజా కేసు స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవాలి'



టోల్‌గేటు వద్ద మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: అగనంపూడి టోల్‌ప్లాజా కొనసాగింపు విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సుప్రీంకోర్టులో వేసిన కేసును స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నేతలు పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ కోరారు. అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద వారు మాట్లాడుతూ పుష్కరకాలంగా అగనంపూడి పరిధిలో టోల్‌గేటు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ప్రజా సంఘాలు, స్థానికులు ఘోషిస్తూనే ఉన్నారన్నారు. దీంతో 2019లో హైకోర్టు తీర్పుతో అధికారులు టోల్‌ఫీజును ఎత్తివేశారని, అయితే అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మక్కై సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని ఐదేళ్ల నుంచి టోల్ వసూళ్లు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టును తప్పుదోవ పట్టించి స్టే తెచ్చుకున్న అధికారులు బేషరతుగా కోర్టుకు క్షమాపణ చెప్పి, కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్మన్ కిడిమి హనుమంతరావు, నాయకులు శ్రీనివాసరావు, విందుల మోహనరావు పాల్గొన్నారు. అలాగే టోల్‌గేటు పేరుతో ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న రూ.5 భారాన్ని ప్రజా రవాణా సంస్థ వెంటనే ఎత్తివేయాలని రామఅప్పారావు కోరారు.